10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
ఆదివారం 26 జనవరి 2025 పేజీలు 8

# త్రిపుర గవర్నర్ ఫోన్‌నూ ట్యాప్..

**ఇంద్రసేనారెడ్డి నంబరున్న ఫోన్ సంభాషణలు గుట్టుగా విన్న ప్రభాకర్‌రావు బృందం**
**ఆయన ఓఎస్డీ నర్సింహులు వాంగ్మూలం నమోదు చేసిన పోలీసులు**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దర్యాప్తు మొదలై దాదాపు ఏడాది కావొస్తున్నా నేటికీ సంచలన విషయాలు బహిర్గతమవుతూనే ఉన్నాయి. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఫోన్ కూడా ట్యాప్ అయినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇంద్రసేనారెడ్డి ఓఎస్డీ జి.నర్సింహులు పేరిట ఉన్న ఫోన్ నంబరును తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి(ఎస్ఐబీ) కేంద్రంగా ట్యాప్ చేసినట్లు వెల్లడైంది. ఈ విషయాన్ని తాజాగా గుర్తించిన హైదరాబాద్ పోలీసులు రెండు రోజుల క్రితం నర్సింహులును పిలిచి విచారించారు. మీరు చెప్పేవరకు ఈ విషయం తనకు తెలియదని ఆయన వాంగ్మూలం ఇచ్చినట్లు సమాచారం. ఈ నంబరును ట్యాప్ చేయాలని ఎస్ఐబీని ఎవరు ఆదేశించారనే విషయం అమెరికాకు పారిపోయిన ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావును విచారిస్తేనే తెలుస్తుంది. ఆయన్ను భారత్‌కు రప్పించేందుకు పోలీసులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా సఫలీకృతం కాలేకపోతున్నారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై ఫోన్‌నూ ట్యాప్ చేసినట్లు గతంలో ప్రచారం జరిగినా..

-2లో



# బీజేపీలో చేరిన కరీంనగర్ మేయర్ సునీల్ రావు

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బండి సంజయ్
- బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ అభివృద్ధి జరిగిందన్న మేయర్
- గంగుల కమలాకర్ ఆర్థిక పరిస్థితి అప్పుడేమిటి? ఇప్పుడేమిటి? అని నిలదీత

**హైదరాబాద్ పెన్ పవర్:**కరీంనగర్ మేయర్ సునీల్ రావు కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. సునీల్ రావుకు బండి సంజయ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన అనంతరం మేయర్ సునీల్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌పై సంచలన ఆరోపణలు చేశారు.గంగుల కమలాకర్ టీడీపీ నుంచి వచ్చారని, ఆయన ఆర్థిక పరిస్థితి అప్పుడేమిటి? ఇప్పుడేమిటి? అని ప్రశ్నించారు. టెండర్ల తర్వాత కమిషన్ ముడితే చాలు ఆ తర్వాత గంగుల కనిపించరని ఆరోపించారు. ఆ పనుల గురించి కూడా ఎవరూ పట్టించుకోరని విమర్శించారు. కరీంనగర్‌లో ప్రతి కుంభకోణం వెనుక ఆయన పాత్ర ఉందన్నారు. బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ అభివృద్ధి జరిగిందన్నారు.గంగుల కమలాకర్ కరీంనగర్ అభివృద్ధిని

-2లో

# నందమూరి బాలకృష్ణకు 'పద్మ భూషణ్'.. మంద కృష్ణ మాదిగకు 'పద్మశ్రీ'



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాలను పద్మ అవార్డులు వరించాయి. తెలంగాణ నుంచి ఇద్దరు 'పద్మ' అవార్డులకు ఎంపికయ్యారు. తెలంగాణ- నుంచి వైద్య రంగంలో అందించిన సేవలకు గానూ దువ్వూరి నాగేశ్వర్ రెడ్డిని (ఏఐజీ హాస్పిటల్) పద్మ విభూషణ్ వరించింది. ప్రజా వ్యవహారాల విభాగంలో తెలంగాణకు చెందిన మందకృష్ణ మాదిగ (ఎమ్మార్పీస్ అధ్యక్షుడు) పద్మశ్రీ అవార్డునకు ఎంపికయ్యారు. ఇక.. ఏపీకి చెందిన ఐదుగురు విభిన్న రంగాల్లో సేవలందించినందుకు గానూ పద్మ అవార్డులకు ఎంపిక కావడం గమనార్హం. కళా రంగంలో సేవలందించినందుకు ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణను పద్మ భూషణ్ అవార్డు వరించింది.

-2లో

# హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త

- స్టేషన్ నుంచి గమ్యస్థానాలకు చేరుకోవడాన్ని సులభతరం చేసిన మెట్రో రైలు
- ఈవీ జిప్ వాహనాలతో గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని వెల్లడి
- వాహనాలను ప్రారంభించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగర మెట్రో ప్రయాణికులకు శుభవార్త. మెట్రోలో ప్రయాణించే వారు స్టేషన్ నుంచి గమ్యస్థానాలకు చేరుకోవడాన్ని సులభతరం చేసింది. కాలుష్యరహిత వాహనాలను మెట్రో స్టేషన్‌తో అనుసంధానం చేసింది. మెట్రో స్టేషన్ నుంచి ఇళ్లు, కార్యాలయం, కాలేజీలకు వెళ్లే వారు తమ సొంత వాహనాలను ఉపయోగించాల్సిన అవసరం లేదని తెలిపింది. ఎలక్ట్రానిక్ వెహికిల్ జిప్ వాహనాలతో తమ గమ్యస్థానాలను చేరుకోవచ్చునని తెలిపింది.

-2లో

# ప్రేమ్ లాల్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా ఆదుకుంటాం



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇందిరా భవన్ లో నిర్వహించిన ప్రేమ్ లాల్ సంతాపసభలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రేమలాల్ లాంటి క్రమశిక్షణతో పని చేసిన నాయకుడు లేకపోవడం పార్టీకి తీరని లోటు అని అన్నారు. ఎలాంటి పార్టీ పని అప్పగిం చిన చిత్తశుద్ధి తో పని చేసిన నాయకుడు ప్రేమ లాల్ అన్నారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన నాయకులను పార్టీ గుర్తించాలని అన్నారు ఉత్తమ్ కుమార్ రెడ్డి.ప్రేమ్ లాల్ కుటుంబానికి ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా ఆదుకుంటానని అన్నారు.అనేక కష్టాలు, నష్టాలు అనుభవించి పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు పని చేయడం వల్లనే తెలంగాణ లో కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగిందని అన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న మనం కార్యకర్తలను, నాయకులను ఆదుకోవాలని అన్నారు.

-2లో

## ప్రేమ్ లాల్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా ఆదుకుంటాం

- మొదటి పేజి తరువాయి
ప్రేమ్ లాల్ స్వచ్ఛమైన హిందీ మాట్లాడి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని.... చాలా క్రమశిక్షణ, ఓపిక ఉన్న నాయకుడని అన్నారు. ప్రేమ్ లాల్ మరణం పార్టీకి తీరని లోటు అని.. పార్టీ చెప్పిన పని చేస్తూ క్రమశిక్షణ గా ఉన్న నాయకులు ప్రేమ్ లాల్ అని అన్నారు. ప్రేమ్ లాల్ కుటుంబానికి అండగా పార్టీ నిలబడుతుందని.. పార్టీ లో కష్టపడ్డ కార్యకర్తలను ఆదుకోవడం తన కర్తవ్యమని అన్నారు.

## ప్రేమ్ లాల్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా, వ్యక్తిగతంగా ఆదుకుంటాం

- మొదటి పేజి తరువాయి
ఇదే కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 35 ఏళ్ల నుంచి ప్రేమ్ లాల్ తో తనకు స్నేహం ఉందని... ఇద్దరం కార్పొరేషన్ చైర్మన్ లుగా పని చేసామని అన్నారు.

## బీజేపీలో చేరిన కరీంనగర్ మేయర్ సునీల్ రావు

- మొదటి పేజి తరువాయి
ఏనాడూ పట్టించుకోలేదన్నారు. డ్రైనేజీ నీళ్లు మళ్లించకుండా మానేరు రివర్ ఫ్రంట్ పేరిట నిధులు వృథా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధి ఆగిపోవద్దనే ఉద్దేశంతో తాను ఇన్నాళ్లు మౌనంగా ఉన్నానని వెల్లడించారు.
చెక్ డ్యాంలు, రోడ్ల కాంట్రాక్టర్లంతా గంగుల కమలాకర్ బినామీలేనని... అందుకే అవి త్వరగా కొట్టుకుపోయాయని ఆరోపించారు. తనకు మేయర్ పదవి రాకుండా గంగుల కమలాకర్ అప్పుడే అడ్డుపడ్డారని ధ్వజమెత్తారు. కేవలం కేంద్రం నిధులతోనే నగర అభివృద్ధి జరిగిందన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాషాయ జెండాను ఎగురవేస్తామన్నారు. త్వరలో మరికొంతమంది కార్పొరేటర్లు బీజేపీలో చేరుతారని జోస్యం చెప్పారు.

## హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు శుభవార్త

- మొదటి పేజి తరువాయి
ఢిల్లీ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద మెట్రో హైదరాబాద్ మెట్రో స్టేషన్. ఉద్యోగం చేసేవారు, స్కూల్స్, కాలేజీకి వెళ్లేవారు, వ్యాపారస్తులు ఎంతోమంది మెట్రో రైలును వినియోగిస్తుంటారు. వీరంతా మెట్రో స్టేషన్‌కు రావడానికి, మెట్రో నుంచి గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఆటోలు, క్యాబ్‌లు, సొంత వాహనాలు వినియోగిస్తుంటారు. అయితే తాజాగా మెట్రో కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ వద్ద ఈవీ వాహనాలను అందుబాటులో ఉంచాలని మెట్రో నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన వాహనాలను మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మహిళలకు సయోధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. బైక్ నడపడంలోనూ మెళకువలు నేర్పిస్తున్నారు. రద్దీలో వాహనాలు నడపడంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఐదుగురు మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చినట్లు, భవిష్యత్తులో వంద మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సయోధ్య ఫౌండేషన్ మృదులత చెప్పారు.

# త్రిపుర గవర్నర్ ఫోనూ ట్యాప్..

- మొదటి పేజి తరువాయి
దర్యాప్తు క్రమంలో ఇప్పటివరకు అలాంటి అంశం వెల్లడి కాలేదని సమాచారం.
కేంద్రంలోని సమాచారం కోసమేనా..?
ఇంద్రసేనారెడ్డి 2014 నుంచి తన ఓఎస్డీ పేరిట ఉన్న ఫోన్ నంబరునే వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. 2023 నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఈ నంబరును ఎస్ఐబీ మాజీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు బృందం ట్యాపింగ్ జాబితాలో చేర్చినట్లు పోలీసుల తాజా దర్యాప్తులో వెల్లడైంది. 2023 అక్టోబరు 18న త్రిపుర గవర్నర్‌గా నియమితులైన ఇంద్రసేనారెడ్డి.. అదే నెల 26న బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో అప్పటికే ట్యాపింగ్ వ్యవహారం సాగుతున్న నేపథ్యంలో ఆయన నంబరునూ చేర్చినట్లు సమాచారం. భాజపా నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఏపీ శాసనసభలో భాజపా ఫ్లోర్‌లీడర్‌గా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కార్యదర్శిగా పనిచేసిన ఇంద్రసేనారెడ్డి.. పార్టీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉండటంతో అగ్రనాయకత్వంతో సత్సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రంలోని కీలక రహస్యాలు తెలుస్తాయనే ఉద్దేశంతో గవర్నర్ హోదాలో ఉన్న వ్యక్తి ఫోన్‌ను ప్రభాకర్‌రావు బృందం ఏమాత్రం జంకు లేకుండా ట్యాప్ చేసేందుకు తెగించినట్లు అనుమానిస్తున్నారు.
వ్యవస్థలను గుప్పిట పట్టేందుకే..
ఎస్ఐబీ చీఫ్‌గా ఉద్యోగ విరమణ అనంతరం అక్కడే ఓఎస్డీగా పని చేసిన ప్రభాకర్‌రావు ఈ దందాలో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఎస్ఐబీలోనే డీఎస్పీగా ఉన్న ప్రణీత్‌రావు ద్వారా ఫోన్ అక్రమ ట్యాపింగ్‌ను యథేచ్ఛగా సాగించినట్లు హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే గుర్తించారు.
2023 శాసనసభ ఎన్నికల సమయంలో ఈ దందా పతాకస్థాయికి చేరింది. అప్పట్లో అధికార పార్టీగా ఉన్న భారాసకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభాకర్‌రావు బృందం అడ్డగోలుగా వ్యవహరించింది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ అభ్యర్థుల మద్దతుదారులు, ఆర్థిక వనరులు సమకూర్చే వ్యాపారులను లక్ష్యంగా చేసుకున్నారు. కీలక వ్యవస్థల్లోని ప్రముఖులు, హైకోర్టు జడ్జి దంపతుల ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు తేలడం నివ్వెరపోయేలా చేసింది. తాజాగా గవర్నర్ ఫోన్‌పైనా నిఘా ఉంచినట్లు బయటపడటంతో మరింత విస్తుపోయేలా చేస్తోంది.

# నందమూరి బాలకృష్ణకు 'పద్మ భూషణ్'.. మంద కృష్ణ మాదిగకు 'పద్మశ్రీ'

- మొదటి పేజి తరువాయి
కళా రంగంలోనే ఆంధ్రప్రదేశ్-కు చెందిన మిరియాల అప్పారావు పద్మ శ్రీ అవార్డుకు ఎంపిక కావడం గమనార్హం. ఏపీ నుంచి మరో ముగ్గురు కూడా పద్మ అవార్డులకు ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి 'పద్మ' అవార్డులకు ఎంపికైంది వీళ్లే.
76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 'పద్మ' అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే.

**తెలుగు రాష్ట్రాల నుంచి 'పద్మ' అవార్డులకు ఎంపికైన ప్రముఖుల జాబితా:**

తెలంగాణ- దువ్వూరి నాగేశ్వర్ రెడ్డి (పద్మ విభూషణ్) (వైద్యం)
తెలంగాణ- మందకృష్ణ మాదిగ (పద్మశ్రీ) (ప్రజా వ్యవహారాలు)
ఆంధ్రప్రదేశ్- నందమూరి బాలకృష్ణ (పద్మ భూషణ్) (కళా రంగం)
ఆంధ్రప్రదేశ్- మిరియాల అప్పారావు (పద్మ శ్రీ) (కళా రంగం)
ఆంధ్రప్రదేశ్- కేఎల్ కృష్ణ (పద్మ శ్రీ) (సాహిత్యం)
ఆంధ్రప్రదేశ్- మాడుగుల నాగఫణిశర్మ (పద్మ శ్రీ) (కళలు)
ఆంధ్రప్రదేశ్- పంచముఖి రాఘవాచార్య (పద్మ శ్రీ) (సాహిత్యం)

**పద్మ అవార్డులకు ఎంపికైన క్రీడాకారుల జాబితా:**

పీఆర్ శ్రీజేష్ (కేరళ): పద్మభూషణ్
రవిచంద్రన్ అశ్విన్ (తమిళనాడు): పద్మశ్రీ
హర్విందర్ సింగ్ (హర్యానా): పద్మశ్రీ
ఇనివాళప్పిల్ మణి విజయన్ (కేరళ): పద్మశ్రీ
సత్యపాల్ సింగ్ (ఉత్తర ప్రదేశ్): పద్మశ్రీ

# మాదంతా క్లీన్...

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అగ్ర నిర్మాత, సంక్రాంతికి విడుదలైన మూడు సినిమాలను తెలంగాణతో పాటు ఉత్తరాంధ్రలో డిస్టిబ్యూట్ చేసిన 'దిల్' రాజు ను ప్రభుత్వం లేదంటే ప్రభుత్వ అధికారులు టార్గెట్ చేశారా? అంటే... 'లేదు' అని ఆయన సమాధానం చెప్పారు. నాలుగు రోజులగా తమ ఆఫీసులతో పాటు ఇళ్లలోనూ జరిగిన ఐటీ రైట్స్ గురించి విలేకరుల సమావేశం నిర్వహించి కీలక విషయాలు వెల్లడించారు. ఐటీ శాఖ రైట్ తర్వాత తనను టార్గెట్ చేశారని వచ్చిన వార్తల మీద దిల్ రాజు స్పందించారు. తాను ఏమీ టార్గెట్ కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఐటీ రైడ్ సాధారణంగా జరిగే ప్రాసెస్ అని, తమ ఆఫీసుల్లో ఈ విధమైన సెర్చ్ జరిగి 18 ఏళ్లు అయ్యిందని, అందువల్ల రైడ్ చేశారని 'దిల్' రాజు వివరించారు. ఆదాయపు పన్ను శాఖ (ఐటీ) రైడ్ గురించి 'దిల్' రాజు మాట్లాడుతూ... "నాలుగు రోజులుగా మా ఇళ్ళలోనూ ఆఫీసుల్లోనూ సోదాలు జరిగాయి. మా దగ్గర భారీ ఎత్తున డబ్బు ఎవరి డాక్యుమెంట్స్ దొరికాయని కొంతమంది వార్తలు వేశారు. అదంతా అవాస్తవం. మా వద్ద కేవలం 20 లక్షల రూపాయల నగదు మాత్రమే లభించింది. గత ఐదేళ్లుగా మేము ఎక్కడ ఇన్వెస్ట్ చేయలేదు. మా డాక్యుమెంట్స్ అన్నీ ఐటీ శాఖ చెక్ చేశారు. చివరకు వాళ్లు ఆశ్చర్యపోయారు. మాదంతా క్లీన్" అని వివరించారు. ఫిబ్రవరి 3న ఐటీ అధికారులు కలవమని చెప్పారని, తమ ఆడిటర్లు వెళ్లి కలుస్తారని 'దిల్' రాజు తెలిపారు. ఇండస్ట్రీలో పలువురు నిర్మాతల మీద ఆదాయపు పన్ను శాఖ రైడ్ చేయడంతో ఒక్కసారిగా ఊహాగానాలు మొదలు అయ్యాయి. ఈ ఏడాది ప్రారంభంలో తెలుగు చిత్ర సీమను ప్రభుత్వాలు టార్గెట్ చేశాయా? అనే ప్రచారం జరిగింది. అటువంటి ఊహాగానాలకు 'దిల్' రాజు చెక్ పెట్టారు. ఎక్కువగా ఊహించుకోవద్దని, ఎటువంటి హడావిడి లేదని, ఇండస్ట్రీలో అంతా ఆన్లైన్ బుకింగ్స్, ఆన్లైన్ ట్రాన్సాక్షన్స్ జరుగుతున్నాయని ఆయన వివరించారు.

# మేడ్చల్ జిల్లా అధికారులు.. ఓటరు ప్రతిజ్ఞ..






- ఓటరు దినోత్సవం సందర్భంగా.. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ..
- జిల్లా వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని సూచన..
- 15వ జాతీయ ఓటరు డే పురస్కరించుకొని మేడ్చల్ కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 25:** 15వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ ఉద్యోగుల అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఈ 15వ జాతీయ ఓటరు దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.. అనంతరం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు, విద్యార్థులు, యువకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఇప్పుడు ప్రతి ఏడాది నాలుగు సార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించిందని అన్నారు.. ఓటరుగా నమోదుకు సమీపంలోని పోలింగ్ కేంద్రానికి వెళ్లి బిఎల్ఓలను సంప్రదించి ఓటరు నమోదుకు ఫామ్ – 6 తో పాటు, ఫామ్ – 6బి ద్వారా ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తెలియజేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోని, ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకొని మంచి ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్నట్లయితే మన నియోజకవర్గాన్ని, జిల్లాను, రాష్ట్రాన్ని చక్కగా అభివృద్ధి పరచుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా భూసేకరణ అధికారి శంకర్ కుమార్, డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఓటు హక్కు పై నిర్వహించిన రంగోలీ పోటీలలో పాల్గొన్న విజేతలకు, స్వీప్ కార్యక్రమాలను బాగా ప్రచారం చేసిన టిఎస్ఎస్ కళాకరులకు జిల్లా అదనపు కలెక్టర్ ప్రోత్సాహక సర్టిఫికెట్‌లు, మెమెంటోలను ప్రధానం చేసారు.









# రాష్ట్రపతి గ్యాలంటరీ అవార్డులకు ఎంపికైన తెలంగాణ అధికారులు వీరే

**హైదరాబాద్ పెన్ పవర్:** 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 942 మంది పోలీసు, అగ్నిమాపక, పౌర రక్షణ సిబ్బందికి వివిధ విభాగాల్లో శౌర్య, సేవా పతకాలు అందించనున్నట్లు తెలిపింది కేంద్రం. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది ప్రభుత్వం. వీటిలో 95 శౌర్య పతకాలు ఉన్నట్లు తెలిపింది. ఈ అవార్డు గ్రహీతలలో పోలీసు, అగ్నిమాపక, హెూంగార్డు మరియు సివిల్ డిఫెన్స్ సిబ్బంది, కరెక్షనల్ సర్వీసెస్ సేవల్లో పనిచేస్తున్న వారు ఉన్నారని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ తెలిపింది. వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో మోహరించిన 28 మంది, జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో 28 మంది, ఈశాన్య ప్రాంతంలో ముగ్గురు, ఇతర ప్రాంతాల్లో 36 మందిని గ్యాలంటరీ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపింది ప్రభుత్వం. 101 రాష్ట్రపతి పతకాలలో 85 పోలీసు సిబ్బందికి, 5 అగ్నిమాపక సిబ్బందికి, 7 సివిల్ డిఫెన్స్, హెూంగార్డు సర్వీస్‌లకు 4 పతకాలు కరెక్షనల్ సర్వీసెస్ కి అందించనున్నట్లు తెలిపింది ప్రభుత్వం.

తెలంగాణ నుంచి 21 మంది పోలీస్ సిబ్బంది ఎంపికైనట్లు సమాచారం. వీరిలో పోలీసు సిబ్బందిలో విశిష్ట సేవలకు 2, మెరిటోరియస్ సర్వీస్ కి 12, అగ్నిమాపక విభాగంలో మెరిటోరియస్ సర్వీస్ కి 3, హెూంగార్డు విభాగంలో మెరిటోరియస్ సర్వీస్ 4 పతకాలు ఉన్నట్లు సమాచారం.

రాష్ట్రపతి పతకాలకు అందుకోనున్న తెలంగాణ



**అధికారులు వీరే:**

**పోలీసు విభాగం:**

కార్తికేయ, ఇన్‌స్పెక్టర్ జనరల్,

అన్నల ముత్యం రెడ్డి, పోలీసు సూపరింటెండెంట్,

కమల్ల రామ్ కుమార్, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్,

మహమ్మద్ ఫజ్లూర్ రెహమాన్, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్,

కోటపాటి వెంకట రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్

అన్ను వేణుగోపాల్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్,

రణ్‌వీర్ సింగ్ ఠాకూర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్,

పీటర్ జోసెఫ్ బహదూర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్,

మహ్మద్ మొయినుల్లా ఖాన్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్,

వద్యా పథ్యా నాయక్, హెడ్ కానిస్టేబుల్,

అనుమల నిరంజన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్,

ఎండీ అయూబ్ ఖాన్, హెడ్ కానిస్టేబుల్

**అగ్నిమాపక విభాగం:**

వేంకటేశ్వర రావు మోరుబోయిన, లీడింగ్ ఫైర్‌మెన్

సుబ్బయ్య చావల, లీడింగ్ ఫైర్‌మెన్,

జనార్దన్ కారుకూరి, లీడింగ్ ఫైర్‌మెన్,

**హెూ**

ఈశ్వరయ్య మంత్రి, హెూమ్ గార్డ్

యాదగిరి మేడిపల్లి, హెూమ్ గార్డ్

లక్ష్మణ్ కోమటి, హెూమ్ గార్డ్

అయిలయ్య కళ్లెంల, హెూమ్ గార్డ్


# మందుబాబులకు బ్యాడ్‌న్యూస్.. రేపు మూతపడనున్న వైన్స్!




- రేపు రిపబ్లిక్ డే సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో మందు, మాంసం దుకాణాలు బంద్
- ఈ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు
- నిరాశలో మందు, ముక్కతో వీకెండ్‌ను ఎంజాయ్ చేద్దామనుకున్న జనం

**హైదరాబాద్ పెన్ పవర్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మందు, మాంసం దుకాణాలు మూతపడనున్నాయి. తిరిగి సోమవారం ఉదయం తెరుచుకుంటాయి. ఈ మేరకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు మద్యం, మాంసం విక్రయించే దుకాణదారులకు ఆదేశాలు జారీ చేశాయి. అయితే, రేపు ఆదివారం కావడంతో మందు, ముక్కతో వీకెండ్‌ను ఎంజాయ్ చేద్దామనుకున్న వారికి ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పాలి. ఈరోజు రాత్రి నుంచే జంతు వధను నిషేధించినట్లు పేర్కొన్నాయి. ఒకవేళ ఎవరైన ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించాయి. అన్ని పట్టణాల్లోనూ ఇవే ఆదేశాలు జారీ అయ్యాయి. ఇక ఈ విషయం తెలిసిన మందుబాబులు ఇవాళ ఉదయం నుంచే వైన్స్ ముందు క్యూకడుతున్నారు. ముందుగానే తమకు కావాల్సిన మద్యం బాటిళ్లను ఇంటికి తెచ్చుకుంటున్నారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డేతో గాంధీ జయంతి వంటి జాతీయ దినోత్సవాల సందర్భంగా మద్యం, మాంసం విక్రయాలపై ప్రభుత్వాలు బంద్ చేస్తుంటాయనే విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రేపటి 76వ గణతంత్ర దినోత్సవం కారణంగా తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు మందు, ముక్కలపై బంద్ విధించాయి.

## మంత్రి పొంగులేటి అసహనం.. కరీంనగర్ కలెక్టర్ భావోద్వేగ పోస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఇన్ స్టాగ్రమ్ లో భావోద్వేగ పోస్ట్ పెట్టారు. కలెక్టర్ గా ఎదిగే క్రమంలో ఎన్నో రకాల ఒడిదుడుకులను ఎదురుకున్నాను. మహిళగా ఎన్నో రకాల వివక్ష, అణిచివేత, ఇబ్బందులను తట్టుకున్నాను. పలు సార్లు యుద్ధం చేస్తాను...కానీ పలు సార్లు ఓడిపోతాను అంటూ పోస్ట్ చేశారు. ఈ పోస్ట్ తర్వాత కాసేపటికి ఇన్ స్టా నుంచే తొలగించడం గమనార్హం. జనవరి 24న కరీంనగర్ లో కేంద్రమంత్రి మనోహర్ లాల్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు వచ్చారు. ఈ సందర్భంగా పదే పదే తోసివేయడంపై అధికారుల తీరుపై పొంగులేటి మండిపడ్డారు. కలెక్టర్ పై అసహనం వ్యక్తం చేశారు. వాట్ ఆర్ యూ డూయింగ్ ..వాట్ ఈజ్ దిస్ నాన్ సెన్స్, అసలు కామన్ సెన్స్ ఉందా? ఎస్పీ ఎక్కడా అంటూ కలెక్టర్ పమేలా సత్పతి ముఖం చూస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ క్రమంలో కలెక్టర్ ఇన్ స్టాలో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొత్త కోణం.. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ కూడా..



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. 2023 నవంబర్ నుంచి 15 రోజుల పాటు ఆయన ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో గవర్నర్ పీఏ నర్సింహ స్టేట్మెంట్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు రికార్డు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని ఇంద్రసేనారెడ్డి ఇప్పటికే చెప్పిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఆయన పీఏ స్టేట్మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారు. ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నేతలే టార్గెట్‌గా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని, ఇందులో నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావు కీలకంగా వ్యవహరించారని మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్ రావు విచారణలో గుట్టు బయట పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో ప్రభాకర్‌రావును ఈ కేసులో ప్రధాన నిందితుడి(ఏ1)గా పోలీసులు చేర్చారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిన విధానాన్ని విచారణలో దర్యాప్తు అధికారులకు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న వెల్లడించారు. నాడు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు ఒప్పుకున్నారు. నాటి ప్రభుత్వ పెద్దలు, ప్రభాకర్ రావు నుంచి అందిన ఫోన్ నంబర్ల ఆధారంగా ట్యాపింగ్ చేసేవాళ్లమని తెలిపారు. వందల సంఖ్యలో ఫోన్ నంబర్స్ అందేవని చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇండ్ల పరిసరాల్లో ట్యాపింగ్ సెంటర్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రభాకర్‌రావుకు అందించేవాళ్లమని తెలిపారు. అసెంబ్లీ ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్ డివైజ్‌లు, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసినట్లు ఈ ముగ్గురూ విచారణలో అంగీకరించినట్టు పోలీసులు ఇప్పటికే పేర్కొన్నారు.

# ఆదివారం హైదరాబాద్ లో ముక్కా లేదు.. చుక్కా ఉండదు..




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదివారం.. వీక్ ఆఫ్ ఒక్కటే కాదు.. ఆ రోజు హైదరాబాదీలకు స్పెషల్ డే కూడా.. ఎందుకంటే ఆదివారం అంటే చాలు ఇంట్లో ముక్క ఉండాల్సిందే.. ముక్క ఉడకాల్సిందే.. ఆదివారం ఉదయం టీ షాపుల దగ్గర కంటే చికెన్, మటన్ షాపుల దగ్గర రద్దీ కామన్.. అంతేనా.. ముక్కతోపాటు చుక్కా ఉండాల్సిందే కదా.. వీకెండ్.. వారం అంతా కష్టపడి.. బ్రెయిన్ హీట్ అయిపోయి ఉంటుంది.. బుర్రను కొంచెం కూల్ చేసేందుకు.. బాధలను మర్చిపోయేందుకు నాలుగు పెగ్గులు వేయటం కామన్.. రొటీన్..అలాంటిది.. ఈ ఆదివారం మాత్రం హైదరాబాద్ లో డ్రై డే.. ముక్కా ఉండదు.. చుక్కా దొరకదు.. అవును.. నిజం.. ఎందుకంటారా.. రిపబ్లిక్ డే.. జనవరి 26వ తేదీ.. ఆదివారం వచ్చింది. రిపబ్లిక్ డే రోజున మందు, మాంసం అమ్మటం నేరం.. వైన్ షాపులు మూసేస్తారు.. బార్లు క్లోజ్ అవుతాయి.. పబ్స్ తెరుచుకోవు.. అంతెందుకు ఆదివారం రోజు ఉదయాన్ని 5 గంటలకు తెరుచుకునే చికెన్, మటన్ షాపులు.. ఈ ఆదివారం మాత్రం షెట్టర్లు క్లోజ్ అన్నమాట..

76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా రేపు ( జనవరి 26, 2025 ) తెలుగు రాష్ట్రాల్లో మద్యం దుకాణాలు, మాంసం దుకాణాలు మూతపడనున్నాయి.. ఆదివారం పూట చుక్క, ముక్కతో ఎంజాయ్ చేసి రిలాక్స్ అవుదామనుకున్నోళ్లకు ఇది బ్యాడ్ న్యూస్ అనే చెప్పాలి. ఈ మేరకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. రిపబ్లిక్ డే సందర్భంగా మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశాయి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు.ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్. అలాగే జీహెచ్ఎంసీ పరిధిలో మద్యం, మాంసం విక్రయాలు బంద్ ఉండనున్నాయి. అన్నీ పట్టణాల్లో కూడా ఇవే తరహా ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా.. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల కారణంగా వరుసగా మూడు రోజులపాటు మద్యం దుకాణాలు బంద్ ఉండనున్నాయి. ఈ క్రమంలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, ఎన్నికల ఫలితాల సందర్భంగా ఫిబ్రవరి 8న కూడా వైన్ షాపులు బంద్ కానున్నాయి.

# ఎసిడిటీ అనుకుంటే హార్ట్ ఎటాక్... తేడా తెలుసుకునేదిలా!

- ఇటీవలి కాలంలో చాలా మందిలో ఎసిడిటీ, గ్యాస్ సమస్య
- ఎప్పుడైనా హార్ట్ ఎటాక్ వచ్చినా... అది ఎసిడిటీ కావొచ్చనే భావనతో నిర్లక్ష్యం
- జాగ్రత్తగా ఉండకపోతే ప్రాణాలకే ప్రమాదం అంటున్న నిపుణులు



**హైదరాబాద్ పెన్ పవర్:**సరైన సమయ పాలన లేకుండా ఆహారం తీసుకోవడం, బాగా మసాలాలు, కారం ఉన్న ఆహారం, ఫ్రైలు, జంక్ ఫుడ్ వంటివాటితో ఇటీవలి కాలంలో చాలా మందిలో ఎసిడిటీ, గ్యాస్ సమస్య తలెత్తుతున్నాయి. తరచూ ఎసిడిటీకి లోనవుతున్నా... స్పైసీ, జంక్ ఫుడ్ అలవాట్లను మార్చుకోలేని వారు ఎందరో! అయితే గుండెపోటు వచ్చిన సమయంలోనూ చాలా వరకు ఎసిడిటీ వంటి లక్షణాలే కనిపిస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఛాతీలో నొప్పి, ఆయాసం, కండరాలు పట్టేయడం వంటివి ఏర్పడితే... ఎసిడిటీ అని భావించి నిర్లక్ష్యం చేస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఇది ప్రమాదకరంగా మారుతోందని స్పష్టం చేస్తున్నారు.

**కొన్ని నీళ్లుతాగి చూస్తే...**

ఛాతీలో నొప్పి, ఆయాసం మొదలైతే... వెంటనే కొన్ని మంచినీళ్లు తాగి చూడాలని, వీలైతే గోరువెచ్చని నీళ్లు తాగాలని నిపుణులు చెబుతున్నారు. అందుబాటులో ఉంటే యాంటాసిడ్ తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఇలా చేసినా ఏమాత్రం ఉపశమనం లేకుంటే... ఛాతీలో నుంచి నొప్పి భుజాలు, దవడ వంటి భాగాలకు విస్తరిస్తే... అది గుండెపోటు అయ్యే అవకాశం ఎక్కువని స్పష్టం చేస్తున్నారు.

**మన కదలికలను బట్టి నొప్పి మారితే...**

సాధారణంగా గుండెపోటు వచ్చినప్పుడు వ్యక్తులు అటూ, ఇటూ నడిచినా, ఏదైనా పనిచేస్తూ ఉన్నా... ఛాతీలో నొప్పి మరింతగా పెరిగిపోతూ ఉంటుంది. కదలడం ఆపివేసి, విశ్రాంతిగా కూర్చుంటే.. నొప్పి అదే స్థాయిలో ఉంటుంది. కొన్నిసార్లు నొప్పి తగ్గుతున్నట్టుగా అనిపిస్తుంది.

అదే ఎసిడిటీ అయితే... అటూ, ఇటూ నడిచినా, ఏదైనా పనిచేస్తూ ఉన్నా... ఛాతీలో నొప్పి ఒకే స్థాయిలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నొప్పి స్థాయిలో తేడా లేకుంటే ఎసిడిటీ అయ్యే అవకాశం ఎక్కువని వివరిస్తున్నారు. అలాగని నిర్లక్ష్యం చేయవద్దని... నొప్పి ఇతర భాగాలకు విస్తరించడం వంటి గుండెపోటు లక్షణాలు స్వల్ప స్థాయిలో కనిపించినా అప్రమత్తమై ఆస్పత్రికి వెళ్లాలని స్పష్టం చేస్తున్నారు.

# జగిత్యాల సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో వాడి పడేసిన కండోమ్స్ కలకలం



**హైదరాబాద్ పెన్ పవర్:**జగిత్యాల పట్టణంలోని సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మందుబాబులు పాఠశాల పరిసరాలను భ్రష్టు పట్టించారు. పాఠశాల పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ కండోమ్ ప్యాకెట్లు, మద్యం సీసాలు కనిపిస్తున్నాయంటే జగిత్యాల సీఎస్ఐ బాలికల పాఠశాలలో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాఠశాల ఆవరణలోని కండోమ్ ప్యాకెట్లను, మద్యం బాటిళ్లను ఉపాధ్యాయులు విద్యార్థినులతో శుభ్రం చేయించడంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అటెండర్ లేదని, విద్యార్థినులతో కండోమ్ ప్యాకెట్లను శుభ్రం చేయిస్తున్న దృశ్యాలు మీడియా కెమెరాల కంటపడ్డాయి. ఇదేంటని ఉపాధ్యాయులను అడగ్గా.. అసాంఘిక కార్యకలాపాలకు తాము కాపలా ఉండాలా అంటూ నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. ఉపాధ్యాయుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి పరిష్కారం చూపాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థినులతో వాడిపడేసిన కండోమ్స్, తాగి పడేసిన మద్యం సీసాలను ఎత్తించడం ఏంటని విద్యార్థినుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల తీరుపై విద్యార్థి సంఘాలు కూడా మండిపడ్డాయి. జగిత్యాల పట్టణ పోలీసులు ఈ ఉదంతంపై దృష్టి సారించి, పాఠశాల ఆవరణను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

# పూణేలో ఘోర ప్రమాదం.. కాంక్రీట్ లారీ కిందపడి ఇద్దరు ఐటీ ఉద్యోగినులు మృతి!




**హైదరాబాద్ పెన్ పవర్:**మహారాష్ట్రలోని పూణేలో షాకింగ్ సంఘటన చోటు చేసుకుంది. పూణేలో అదుపు తప్పి కాంక్రీట్ లారీ బోల్తా పడడంతో దాని కిందపడి ఇద్దరు ఐటీ ఉద్యోగినులు మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.మూడు రోడ్ల సెంటర్ వద్ద ఈ ప్రమాదం జరిగినట్లు వీడియో చూస్తే తెలుస్తోంది. వేగంగా వెళ్తున్న కాంక్రీట్ లారీ ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే స్కూటీపై వెళ్తున్న వారిపై అమాంతంగా పడిపోయింది. దాంతో ఆ కాంక్రీట్ లారీ కింద పడి ఇద్దరు ఐటీ ఉద్యోగినులు నుజ్జు నుజ్జయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పవన్‌కు ఢిల్లీ నుంచి పిలుపు..? విజయసాయిరెడ్డి రాజీనామా వెనుక ఇంత జరిగిందా..?

**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ అధినేత జగన్ వీర విధేయుడు విజయసాయిరెడ్డి రాజకీయ సన్యాసం తర్వాత ఏపీలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. జనసేన అధినేత పవన్‌కు బీజేపీ హైకమాండ్ నుంచి పిలుపు వచ్చిందనే ప్రచారం జరుగుతోంది. హస్తిన కేంద్రంగా మెగా బ్రదర్స్‌తో బీజేపీ ఏపీలో ఆట మొదలుపెట్టిందని పుకార్లు షికారు చేస్తున్నాయి. మెగాస్టార్ చిరంజీవికి బీజేపీ అధిష్టానం ఇప్పటికే కీలక పదవి ఆఫర్ చేసిందని, పవన్‌ను ముందు నిలిపి టీడీపీతో పనిలేకుండానే ఏపీలో బీజేపీ ముందుకెళ్లాలని చూస్తోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. బీజేపీకి 'కాపు' కాసేది పవనేనని బీజేపీ అధినాయకత్వం బలంగా నమ్ముతోంది. బీజేపీ పట్ల పవన్ ఏకపక్ష సానుకూల వైఖరి కూడా బీజేపీలో ఈ నమ్మకాన్ని మరింత పెంచుతోంది. అమిత్ షా నుంచి పవన్‌కు పిలుపొచ్చిందని.. రేపోమాపో పవన్ హస్తిన పర్యటన ఖాయమని జోరుగా చర్చ నడుస్తోంది.

ఏపీలో ఒంటరిగా ఎదగాలన్న కల పవన్ సాయంతో సాకారం చేసుకోవాలని బీజేపీ హైకమాండ్ ఎప్పటి నుంచో భావిస్తోంది. ఇప్పుడు ఇందుకు సంబంధించిన వ్యూహాన్ని బీజేపీ అమలుచేస్తోందని, కాపులను బీజేపీకి దగ్గర చేసుకునే వ్యూహంలో భాగంగా పవనాస్త్రాన్ని 'కమలం' పార్టీ ప్రయోగిస్తుందని ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీతో మున్ముందు కూడా రాజకీయంగా ముప్పు ఉంటుందనే భావనలో ఉన్న బీజేపీ అటు నుంచి నరుక్కొస్తుందనే వాదనను కూడా కొందరు రాజకీయ విశ్లేషకులు తెరపైకి తెస్తున్నారు. బీజేపీ ఎత్తుగడలో భాగంగానే ఏపీ పాలిటిక్స్‌లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. విజయసాయి రెడ్డి పొలిటికల్ రిటైర్మెంట్‌తో ఈ వాదన మరోసారి తెరపైకొచ్చింది.





జగన్ నమ్మిన బంటు విజయసాయి రెడ్డి రాజకీయ సన్యాసం ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ 11 స్థానాలకే పరిమితమైన తర్వాత ఏపీలో రాజకీయ సమీకరణాలు చాలానే మారాయి. జగన్ సమీప బంధువు బాలినేనితో పాటు అప్పటి వరకూ వైసీపీ కీలక నేతలుగా వ్యవహరించిన పలువురు రాజీనామా చేయడంతో వైసీపీలో కల్లోలం రేగింది. అయితే.. రాజ్యసభ సభ్యత్వానికి, రాజకీయాలకు విజయ సాయి రెడ్డి గుడ్ బై చెప్పడం మాత్రం అనూహ్య పరిణామమనే చెప్పాలి. ఈ పరిణామం వైసీపీ కేడర్‌కు ఊహించని ఝలక్ అని చెప్పక తప్పదు. బీజేపీకి అమిత్ షా, టీడీపీకి అచ్చెన్నాయుడు ఎలానో వైసీపీకి విజయసాయి రెడ్డి అంత కీలకమైన వ్యక్తి. ఢిల్లీలో వైసీపీ తరపున రాజకీయంగా చక్రం తిప్పిన ఉద్ధండుడు. కష్టకాలంలో కూడా జగన్‌కు వెన్నంటే ఉన్న నేత. వైసీపీకి వీర విధేయుడు. ఇంతటి వైసీపీ కరుడుకట్టిన నేత "రాజకీయం వద్దు.. వ్యవసాయం ముద్దు" అని నిర్ణయం తీసుకోవడం వెనుక కూడా రాజకీయమే ఉందనే ఆసక్తికర చర్చ జరుగుతోంది.

హస్తిన కేంద్రంగా బీజేపీ ఏపీ రాజకీయం షురూ చేసిందని సోషల్ మీడియా కోడై కూస్తోంది. 2029లో బీజేపీ ఏపీలో ఒంటరి పోరుకు సిద్ధమైందని.. అందుకు సంబంధించిన సన్నాహాలను ఇప్పటి నుంచే మొదలుపెట్టిందనే ప్రచారం జోరందుకుంది. వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామాలతో ఖాళీ కానున్న స్థానాలను తమ ఖాతాలో వేసుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన స్పష్టమైన సంకేతాలను కూటమి పార్టీలైన టీడీపీ, జనసేనకు బీజేపీ అధిష్టానం కుండబద్దలు కొట్టి మరీ చెప్పినట్లు రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. అయితే.. వైసీపీని గల్లీ నుంచి ఢిల్లీ వరకూ వీలైనంత బలహీనపడేలా చేసి తద్వారా లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందని, ఈ పరిణామం ఏపీ బీజేపీకి కలిసొస్తుందని బీజేపీ హైకమాండ్ భావిస్తున్నట్లు ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది.

ఏపీలో నెలకొన్న రాజకీయ పరిణామాలను రాజకీయ విశ్లేషకులు ఏ విధంగా అంచనా వేస్తున్నారంటే..

మెజారిటీ రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ఏపీ రాజకీయాలను, కులాలను వేరుగా చూడలేమన్నది రాజకీయ విశ్లేషకుల బలమైన అభిప్రాయం. ఏపీ రాజకీయాలను విశ్లేషిస్తున్న విశ్లేషకుల అంచనా ఎలా ఉందంటే.. ఆంధ్రాలో ప్రధాన రాజకీయ పార్టీలకు కొన్ని సామాజిక వర్గాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయనేది కూడా జగమెరిగిన సత్యం. టీడీపీకి ఎప్పటి నుంచో ఒక ప్రధాన సామాజిక వర్గం, వైసీపీకి ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్‌కు అండగా నిలిచిన మరో ప్రధాన సామాజిక వర్గం అండగా ఉంటూ వచ్చాయి. ఇప్పటికీ అండగానే ఉన్నాయి. పవన్ జనసేనకు కూడా ఒక సామాజిక వర్గం 'కాపు' కాస్తుంది. ఒక్క బీజేపీకి మాత్రమే ఒక బలమైన సామాజిక వర్గం అండదండలు ఏపీలో లేకుండా పోయాయి.

బీజేపీ ఒంటరిగా పోటీ చేస్తే ఏపీలో ఎలాంటి ఫలితాలు వచ్చాయో 2019 ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ మనుగడ కోసం 2024లో కూటమి పార్టీలతో జతకట్టడం బీజేపీకి అనివార్యమైంది. అయినప్పటికీ కేంద్రంలో శాసించే శక్తిగా ఉండటంతో కూటమి పార్టీల సీట్ల పంపకాలు కూడా బీజేపీ కోరుకున్నట్టే జరిగాయి. 2029లో జరగనున్న ఏపీ అసెంబ్లీ ఎన్నికల గేమ్ ప్లాన్ ను బీజేపీ ఇప్పటి నుంచే మొదలుపెట్టిందనే ప్రచారం జరుగుతున్న క్రమంలో ఏపీలో ఇంకెలాంటి రాజకీయ మార్పులు చోటుచేసుకుంటాయనే ఆసక్తి నెలకొంది.

# తిరుమలలో ఏం జరుగుతుంది : ఆలయం ఎదుట ఎమ్మెల్యే ఫొటో షూట్.. గంటన్నరపాటు హంగామా




**హైదరాబాద్ పెన్ పవర్:**కలియుగ వైకుంఠం తిరుమల విషయంలో ఇటీవల వరుసగా చోటు చేసుకున్న ఘటనలు చూస్తే ఆలయ పవిత్రతపై శ్రీవారి భక్తులకే కాక సమస్త హిందూ సమాజానికి ఆందోళన కలుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల లడ్డు వివాదం మొదలుకొని.. మొన్నటికి మొన్న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల జారీ కేంద్రాల దగ్గర తొక్కిసలాట వరకు తరచూ తిరుమల ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశాలే అని చెప్పాలి.. తాజాగా తిరుమల ప్రతిష్ఠకు భంగం కలిగించే మరో అంశం వెలుగులోకి వచింది.. శ్రీవారి ఆలయం ముందు ఓ ఎమ్మెల్యే గన్ మెన్లతో ఫోటోషూట్ చేస్తూ గంటన్నరపాటు హడావిడి చేయటం కలకలం రేపుతోంది. శనివారం ( జనవరి 25, 2025 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి.. వీఐపీ బ్రేక్ దర్శనానికి వచ్చిన బళ్లారి కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి ఆలయం ముందు ఫోటోషూట్ తో హడావిడి చేశారు. అంతే కాదు.. గన్ మెన్లు, ప్రైవేట్ సెక్యూరిటీతో హల్చల్ చేశారు ఎమ్మెల్యే. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మెల్యే గన్ మెన్లు, ప్రైవేట్ సెక్యూరిటీతో హల్చల్ చేస్తున్నప్పటికీ విజిలెన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరుమల ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఎమ్మెల్యే వ్యవహరిస్తోంటే టీటీడీ అధికారులు, విజిలెన్స్ అధికారులు పట్టించుకోకుండా ఏం చేస్తున్నారంటూ మండిపడుతున్నారు భక్తులు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు శ్రీవారి భక్తులు.

# కుంభమేళా 'మోనాలిసా' సరికొత్త మేకోవర్!




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రయాగరాజ్ లో జరుగుతున్న మహా కుంభ మేళాలో పూసలు అమ్ముతున్న సుందరి మోనాలిసా భోంస్లే.. అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఎవరీ సుందరి అంటూ దేశవ్యాప్తంగా ఆమె గురించి సోషల్ మీడియాలో వెతికినవారు ఎందరో. ప్రయాగరాజ్ లో ఆమె పూసలు, దండలు అమ్ముతుండగా, ఆమెతో మాట్లాడుతూ తీసిన వీడియోలు ఇంటర్నెట్ లో వైరల్ గా మారాయి కూడా. కేవలం కొన్ని రోజుల్లోనే ఆమె జాతీయ స్థాయిలో ఫేమస్ అయిపోయింది. కుంభమేళాకు వెళ్లినవారు ఆమె ఎక్కడుందనేది తెలుసుకుని వెళ్లి సెల్ఫీలు దిగడం మొదలుపెట్టారు.

**సొంతూరికి తిరిగి వెళ్లిపోయి...**

పెద్ద సంఖ్యలో ఆమె వద్దకు రావడం ఇబ్బందిగా మారింది. పూసలు, దండలు అమ్మేపని పక్కనపడిపోయింది. దీనిని తట్టుకోలేక తండ్రి ఆమెను సొంతూరు ఇండోర్ కు పంపేశారనే వార్తలు వెలువడ్డాయి. అలాంటిది ఇప్పుడు మోనాలిసా భోంస్లే మరోసారి వైరల్ గా మారింది. ఈసారి తమ ఊరిలో ఓ మేకప్ నిపుణురాలి దగ్గర మేకప్ వేయించుకుంటున్న వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టింది. 'ఎక్స్'లో పోస్టు చేసిన ఈ వీడియోకు ఇప్పటికే మిలియన్ కుపైగా వ్యూస్ వచ్చాయి.

# యువకులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి






## జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

**హైదరాబాద్ పెన్ పవర్:** యువకులందరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుంచి కొత్తగూడెం క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ముందుగా పోస్ట్ ఆఫీస్ సెంటర్లో మానవహారం ఏర్పరచి జాతీయ ఓటర్ల దినోత్సవం గురించి తెలియజేయడం జరిగింది. కొత్తగూడెం క్లబ్ లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ మాట్లాడుతూ మన జిల్లాలో ఉన్న పౌరులు అందరూ నిష్పక్షపాతంగా ప్రశాంతంగా ఎన్నికలలో ఓటు వేయవలసిందిగా పేర్కొన్నారు.

మతం జాతి కులం వర్గం భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. 18 సంవత్సరాల నుండిన యువతి యువకులం దరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వకృత్వ వ్యాసరచన డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది. బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీస్ అవార్డును కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్యకి, డిఎల్ ఎంటి సాయి కృష్ణకు అందజేయడం జరిగింది. ట్రాన్స్ జెండర్ ఓటర్లకు, సీనియర్ సిటిజన్ ని కూడా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు సీనియర్ సిటిజన్స్ నూతన ఓటర్లు సుమారు 2000 మంది పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ విద్య చందన, జిల్లా పరిషత్ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవో మధు, డి.ఎస్.పి రెహమాన్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్, ఎలక్షన్ సెల్ తాసిల్దార్ ధారా ప్రసాద్, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య, లక్ష్మీదేవిపల్లి తాసిల్దార్ ప్రసాద్, సుజాతనగర్ తాసిల్దార్ శిరీష, చుంచుపల్లి తాసిల్దార్ కృష్ణ, పాల్వంచ తాసిల్దార్ వివేక్, రంగాప్రసాద్, అంజాద్ భాష, సెయింట్ మేరీస్, సింగరేణి గర్ల్స్, వివేకవర్ధని విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సేవలకు "నవ లిమిటెడ్" చేయూత అభినందనీయం





## ఓ ఎస్ డి పరితోష్ పంకజ్

## వెల్ఫేర్ హాస్పిటల్ కి ఫిజియోథెరపీ పరికరాలు అందజేత

**హైదరాబాద్ పెన్ పవర్:** పాల్వంచ నవ లిమిటెడ్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం వెల్ఫేర్ ఆస్పత్రికి నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఫిజియోథెరపీ ఎక్విప్మెంట్ పరికరాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓఎస్డి పరితోష్ పంకజ్ పాల్గొని ఫిజియోథెరపీ ల్యాబ్ ను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34 లక్షల రూపాయల ఫిజియోథెరపీ పరికరములు వెల్ఫేర్ హాస్పిటల్ కి అందచేయడం గొప్ప విషయం అని నవ లిమిటెడ్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ పరికరములను ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గ్రే హ్యాండ్స్ పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం సి.యస్ ఆర్ జనరల్ మేనేజర్ ఎంజిఎం.ప్రసాద్ మాట్లాడుతూ నవ లిమిటెడ్ సియస్ఆర్ సేవా కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ డిజిఎం కృష్ణారావు వెల్ఫేర్ ఆఫీసర్, పోలీస్ సిబ్బంది, సి.యస్ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



# తాటిపల్లి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన దుస్తుల పంపిణీ

**హైదరాబాద్ పెన్ పవర్:** చుంచుపల్లి మండలం పెనగడప గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం నూతన వస్త్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా తాటిపల్లి సేవ ట్రస్ట్ అధ్యక్షుడు తాటిపల్లి శంకర్ బాబు మాట్లాడుతూ తన తండ్రి స్థాపించిన ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు వెయ్యి మందికి వస్త్రాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో వాష్ రూంలు నిర్మాణం కోసం 15 వేల నగదు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. జమాతే ఇస్లామి హింద్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ బాసిత్ మాట్లాడుతూ అన్ని దానాలలో విద్యా దానం మిన్న అని పేద విద్యార్థులకు చదువుకు సహాయం చేస్తున్న తాటిపల్లి సేవ ట్రస్ట్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులకు 60 మందికి నూతన వస్త్రాలతో పాటు వాష్ రూమ్ ల బాగు చేయడానికి సహాయం చేయడం జరిగిందన్నారు. అనంతరం తాటిపల్లి శంకర్ బాబును ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల బృందం సన్మానించింది.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, కరీం, శాంతి శ్రీ, సరస్వతి, శ్రీనివాస్, బాలు, ప్రేమ్ కుమార్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# పోటీల్లో సత్తా చాటిన రామవరం పాఠశాల విద్యార్థులు

**హైదరాబాద్ పెన్ పవర్:** జాతీయ ఓటర్ల దినోత్సవ వ్యాసరచన పోటీల్లో రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. శనివారం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన వకృత్వ పోటీలలో రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సిధార్థ్, మాన్విత్ లు వకృత్వ పోటీలలో రేయాన్ షరీఫ్ వ్యాసరచన పోటీలలో రాణించి కొత్తగూడెం నియోజకవర్గస్థాయిలో బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ప్రభు దయాల్ అభినందించారు.

## శ్రీ రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# జాతీయ ఓటర్ల దినోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్::** శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో ప్రధానాచార్యులు డాక్టర్ కె.వనజ అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకొని ఎన్నికలలో ఓటు వేయాలని అన్నారు. అనంతరం కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందరూ తమ ప్రాథమిక హక్కు అయిన ఓటును నిజాయితీగా వేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పూర్ణచందర్, బి.వెంకన్న, సునీత, విద్యా ప్రవీణ, వెంకటేశ్వర్లు, సుస్మిత, అంజని, వెంకటరమణ, శ్రీలత, లక్ష్మీనారాయణ, ఏఓ శివ జ్యోతి, అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ

ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన బోడపూడి లక్ష్మీనారాయణ, చిలకమూడి మల్లేశ్వరరావు లకు శనివారం కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. లక్షలు ఖర్చు చేసి కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకం కొండంత అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బుర్ర పుల్లారెడ్డి,గోపాల్ రెడ్డి,ముత్తినేని కోటేశ్వరరావు,మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు,గుర్రం వెంకట్ రెడ్డి,బోడపూడి సత్యనారాయణ గీత లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో సిపిఎం నాయకుడు కాసాని ఐలయ్య మృతి : పలువురు సంతాపం

**హైదరాబాద్ పెన్ పవర్:** సిపిఎం సీనియర్ రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య గుండెపోటుతో శనివారం మరణించడం జరిగింది. కాసాని ఐలయ్య డయాలసిస్ నుకొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేసుకుంటుండగా అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మరణించారు. కాసాని ఐలయ్య మరణ వార్త తెలిసిన వెంటనే మాజీ పార్లమెంట్ సభ్యుడు సిపిఎం సీనియర్ నాయకులు తమ్మినేని వీరభద్రం, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, భూక్య రమేష్, జునుమాల నగేష్, లిక్కి బాలరాజు, సిపిఎం అభిమానులు, కార్యకర్తలు తదితరులు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

## ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ జిల్లాస్థాయి క్రీడల్లో అనురాగ్ కాలేజీ విద్యార్థుల ప్రభంజనం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి నల్గొండ జిల్లా పాలిటెక్నిక్ క్రీడల్లో అనురాగ్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈనెల 23న నందికొండ లో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడల్లో అనురాగ్ విద్యార్థులు ప్రథమ ధృతీయ స్థానాల్లో విజయాలను సాధించి రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి. సురేష్ కుమార్,జె. శ్రీనివాసరావు తెలిపారు. వాలీబాల్ డబల్ టెన్నిస్ సింగిల్ టెన్నిస్ షటిల్ బ్యాట్మెంటన్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించగా షటిల్ సింగిల్స్ లో ద్వితీయ బహుమతి గెలుపొందారని,అదేవిధంగా లాంగ్ జంప్,హై జంప్,త్రిఫల్ జంప్,డ్రోస్ షార్ట్ పుట్ జావెలిన్ లలో ప్రథమ స్థానం,100 మీటర్లు,200 మీటర్లు,400 మీటర్లు,800 మీటర్ల పరుగు పందాల్లో ప్రథమ బహుమతి గెలుపొందారని అన్నారు. విజేతలుగా నిలిచిన అనురాగ్ విద్యార్థులు ఫిబ్రవరి 3, 4న నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడల్లో అర్హత సాధించారని తెలిపారు.

# ప్రతి వ్యక్తికి లైఫ్ ఇన్సూరెన్స్ భరోసా

## కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్







**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి వ్యక్తికి లైఫ్ ఇన్స్యూరెన్స్ తప్పనిసరి అని భద్రాద్రి కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ అన్నారు. భారతదేశంలో 2047 సంవత్సరం వరకు ప్రతి వ్యక్తికి లైఫ్ ఇన్సూరెన్స్ ఉండాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్న ఐ ఆర్ డి ఏ సెంట్రల్ గవర్నమెంట్ సంస్థకి సపోర్ట్ గా టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్సూరెన్స్ మేము సైతం అంటూ టాటా ఏ ఐ ఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో సంకల్ప ర్యాలీ కార్యక్రమాన్ని శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి డిఎస్పి రెహమాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లైఫ్ ఇన్సూరెన్స్ అనేది ప్రతి వ్యక్తికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సంపాదించిన సొమ్ములో లైఫ్ ఇన్సూరెన్స్ లో కొంత దాచుకోవాలని దాని ద్వారా కుటుంబానికి భద్రతతో పాటు భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. జీవిత బీమా ఉన్నవారు ధీమాతో ఉండవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో టాటా ఏ ఐ ఏ డిప్యూటీ డైరెక్టర్ వేముల వినోద్ కుమార్, కొత్తగూడెం బ్రాంచ్ రాహుల్, లీడర్లు కొచ్చర్ల కమల రాణి, నాగేంద్రారెడ్డి, మహబూబ్ పాషా, శివప్రసాద్, లోకేష్ ,వెంకన్న, వీరన్న, వీరభద్రం, నరెడ్ల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రిటికల్ మినరల్స్ మైనింగ్ రంగంలో సింగరేణికి పూర్తి సహకారం




**హైదరాబాద్ పెన్ పవర్:** బొగ్గు మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి కాలరీస్ లిథియం లాంటి క్రిటికల్ మినరల్స్ రంగంలోకి ప్రవేశించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించిన నేపథ్యంలో ఆ దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సమక్షంలో ఇటీవల ఐఐటీ హైదరాబాద్ తో కీలక ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి నేతృత్వంలో ప్రొఫెసర్ల బృందం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ నేతృత్వంలో డైరెక్టర్లు, సీనియర్ మైనింగ్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమైంది. క్రిటికల్ మినరల్స్ రంగంలోకి ప్రవేశించేందుకు సింగరేణి చేస్తున్న ప్రయత్నాలకు హైదరాబాద్ ఐఐటీ పూర్తి సహకారం అందిస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవిష్యత్లో బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా క్రిటికల్ మినరల్స్ మైనింగ్, ప్రాసెసింగ్లోనూ సింగరేణిని దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దేందుకు మేథో విజ్ఞానాన్ని సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశం లో క్రిటికల్ మినరల్స్ మైనింగ్ రంగంలో సంయుక్త పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చ జరిగింది.
రిన్యూవబుల్ ఎనర్జీ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఎలక్ట్రానిక్స్ తయారీలో క్రిటికల్ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని బిఎస్.మూర్తి తెలిపారు. హరిత ఇంధనాన్ని ప్రోత్సహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడంలో క్రిటికల్ మినరల్స్ మైనింగ్ది కీలక పాత్ర అన్నారు. ఐఐటీ హైదరాబాద్లో నిపుణులు ఈ రంగంలో ఇప్పటికే పరిశోధనలు చేస్తున్నారని, ఆస్ట్రేలియాలోని ప్రముఖ యూనివర్సిటీలైన మోనాష్, సిడ్నీలోని న్యూ సౌత్ వేల్స్ యూనివర్సిటీలతో ప్రత్యేక ఒప్పందం ఉందని చెప్పారు. అంతర్జాతీయ నిపుణుల సహకారంతో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి మానవ వనరుల అభివృద్ధిలో భాగంగా సింగరేణి ఉద్యోగులకు ఐఐటీ ద్వారా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అందించడం వారి నైపుణ్యాలను మెరుగుపరచడం మైనింగ్ రంగంలో డ్రోన్లు కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలనుఅనుసంధానం చేయడానికి తోడ్పాటును అందిస్తామన్నారు. అలాగే ఐఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఇంక్యుబేషన్ కేంద్రాన్ని అంకుర పరిశ్రమల యూనిట్ను కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ సింగరేణితో మేథో విజ్ఞానాన్ని పంచుకోవడానికి ఐఐటీ హైదరాబాద్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. త్వరలోనే క్రిటికల్ మినరల్స్ పై సింగరేణి అధికారులకు అవగాహన కల్పించేందుకు ఐఐటీ హైదరాబాద్ నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక వర్క్షాప్ను నిర్వహిస్తామన్నారు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్ లోనూ అరుదైన ఖనిజాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలిందని వీటిని వాణిజ్యపరంగా ఉపయోగించుకోవడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపైనా పరిశీలించాలని ఐఐటీ హైదరాబాద్ బృందాన్ని కోరారు.
ఈ సమావేశంలో కొత్తగూడెం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, జి.వెంకటేశ్వరరెడ్డి, సింగరేణి భవన్ నుంచి జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, నిపుణులు సందీప్ హామిల్టన్, ఐఐటీ హైదరాబాద్ నుంచి ప్రొఫెసర్ నరసింహ, అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్ కామరాజు తదితరులు పాల్గొన్నారు.